
మే 14వ హనుమజ్జయంతి

మే 2023

# గురువాణి

శ్రీవిద్యా జ్ఞాన పీఠం ఆధ్యాత్మిక మాస పత్రిక



## శ్రీవిద్యా సాధన
### శ్రీచక్ర నవావరణ పూజ

## మందిరాలు
### పళని సుబ్రహ్మణ్య స్వామి

ఈ సంచిక నుండి, “బాలల” మరియు “సంబంధ బాంధవ్యాలు” విభాగాలను పరిచయం చేస్తున్నాము



# శ్రీ సుబ్రహ్మణ్య ధ్యానం

షణ్ముఖం పార్వతీ పుత్రం, క్రౌంచ శైల విమర్ధనం
దేవసేనాపతిం దేవం స్కందం వందే శివాత్మజం
తారకాసుర హంతారం మయూరాసన సంస్థితం
శక్తి పాణించ దేవేశం స్కందం వందే శివాత్మజం

# గురువాణి

విషయ సూచిక

**గురువాణి ఆధ్యాత్మిక మాస పత్రిక**
సంపుటి -1 సంచిక - 9, మే 2023,
35 పేజీలు

**గురువాణి** డిజిటల్ తెలుగు మాస పత్రిక, శ్రీవిద్య లెర్నింగ్ సెంటర్ వారిచే ముద్రించబడినది.

గురువాణి సమాచార పత్రిక ను అందరికీ షేర్ చేయడం, యూ ట్యూబ్ ఛానల్ మరియు ఫేస్ బుక్ పేజి లలో చేరడం ద్వారా పీఠం యొక్క కార్యక్రమాలలో మీరు భాగస్వాములు కావచ్చును.

Subscribe Newsletter

Follow on Facebook

Subscribe YouTube

©Srividya Learning Centre

**శ్రీవిద్య లెర్నింగ్ సెంటర్**
(సౌందర్య లహరి యొక్క ఒక విభాగము)

#69, 6th Cross Street, Girinagar Phase I,
Bengaluru, K A 560085, India.

srimeru999@gmail.com

+91 8088256632

www.srimeru.org

**ఈ సంచికలో** — **పేజీ**

**కవర్ పేజీ చిత్రము**
రాజరాజేశ్వరి దేవి

**ధ్యానం**
శ్రీ సుబ్రహ్మణ్య ధ్యానం 02

**గురువాణి**
ఆచమనం ప్రాముఖ్యత ఏమిటి? 04

**శ్రీ విద్యా జ్ఞాన పీఠము సమాచారం** 07

**శ్రీవిద్యా సాధన**
శ్రీచక్ర నవావరణ పూజ 09

**శ్రీవిద్యా మందిరాలు**
పళని సుబ్రహ్మణ్య స్వామి 12

NEW **నివారణోపాయములు**
సంబంధ బాంధవ్యాలు 17

**సాధకుల అనుభవాలు** 21

**ప్రశ్నలు - సమాధానములు** 23


NEW **బాలల విభాగము** 26

**శ్రీవిద్య తరగతుల వివరాలు** 30

**రాబోయే కార్యక్రమాలు** 31

**కాల నిర్ణయ పట్టిక** 33

**చివరి పేజీ చిత్రము**
శ్రీవిద్యా జ్ఞాన పీఠంలో అమ్మవారు



## గురువాణి
గురూజీ సందేశము

# ఆచమనం ప్రాముఖ్యత ఏమిటి?

**శ్రీ గురు కరుణామయ** (గురూజీ ప్రవచనాల నుండి)

శ్రీ మాత్రే నమః

మనలో చాలామందికి పూజకి ముందుగా చేసేటటువంటి ఆచమనం "ఎందుకు చేస్తాము? ఎలా చేయాలి ?" అన్న విషయం అర్థం అవ్వకపోవచ్చు. అసలు ఆచమనం, దీపము, ప్రాణాయామము, ధ్యానము ఇవన్నీ పూజలో భాగం ఎందుకు అయ్యాయి ? అని ఆలోచిస్తే సృష్టిలో అన్నిటికన్నా ముందు పంచభూతాలు సృష్టింప బడ్డాయి. పంచభూతాలు ఏమిటి? పృథివ్యాపస్తేజోవాయురాకాశాత్ ! అంటే భూమి, నీరు,అగ్ని, వాయువు, ఆకాశం. అంచేత "అంతటా నిండి యున్నటువంటి ఆ కనబడనటువంటి భగవత్స్వరూపాన్ని నేను నా హృదయంలో ప్రతిష్ఠించుకుని, కనబడేటట్టు చేసుకుని భగవదనుభవం పొందాలి! అంటే నాకు ఉన్న ఒకే ఒక మార్గం ఏమిటంటే ఈ పంచభూతాలతో సంపర్కం పెట్టుకోవడం."

అందువల్లే పూజ చేయడానికి ముందు రాగానే ఆసన శుద్ధి అన్న పేరుతో మనం కూర్చునే స్థానం ముందు కొన్ని అక్షతలు పట్టుకుని "హ్రీమ్ ఆధార శక్తి కమలాసనాయే నమః" అంటే ఏమిటి నేను కూర్చునే ఈ భూమిలో కమలాసన అయినటువంటి లక్ష్మిని నేను చూస్తున్నాను. ఇది భూమి కాదు. ఇది లక్ష్మి. లక్ష్మీదేవి ఒడిలో నేను కూర్చున్నాను.

దీపం వెలిగిస్తున్నాము - "దీపం జ్యోతి పరబ్రహ్మం" అని ఆ దీపంలో పరబ్రహ్మం చూస్తున్నాము. గురువును చూస్తున్నాం. అంటే అగ్ని. అగ్నిలో - అంటే జ్ఞానమే గురువు. ఆ జ్ఞానానికి ప్రతీకగా దీపాన్ని వెలిగించాం.

భూమి అయిపోయింది , అగ్ని అయిపోయింది. ఇంక నీరు మిగిలింది. అందువల్ల నీటిని ఉద్ధరిణితో తీసుకుని కుడిచేతిని చిన్ముద్రగా పెడుతున్నాము. ఏమిటి? నాకు ఏం కావాలో నేను భగవంతుడిని ముందే అడుగుతున్నాను. నాకు జ్ఞానం కావాలి అయ్యా ! అని జ్ఞానికి సంకేతంగా చిన్ముద్ర పెట్టి, చేతిలో నీటిని పోసుకుని, అమృతస్థానం (అరచేయి మణికట్టు మధ్యలో ) దీని ద్వారా ఆ నీరు ప్రవహించినపుడు ఆ అమృత శక్తి నీటిలో ప్రవేశించబడుతుంది. మన శరీరంలో పై పెదవి ఉచ్ఛిష్ట , క్రింది పెదవి అమృత. ఈ శక్తులు అక్కడ ఉన్నాయి. రెండూ కలిస్తేనే ఎంగిలి. అందువల్ల పై పెదవికి తగలకుండా శబ్దం చేయకుండా సాధ్యమైనంత వరకు అలా తాగాలి.

"అసలు ఆచమనం ఏమిటి ?" చమనమ్ అంటే తడి చేయడం." నేను ఇక్కడ భక్తి అనే బీజాన్ని నాటి, అనుభవం అనేటటువంటి మొక్కని నేను పెంచి, దాని ఫలసాయం అనుభవించదలుచుకున్నాను."

## గురూజీ సందేశము

మరి నాటాలి అంటే భూమిని దున్నాలి తడి చెయ్యాలి కదా! రాళ్లల్లో ఎక్కడ మొక్కలు నాటుతాం? అందువల్ల ఈ ప్రాపంచిక విషయాల్లో అలా మునిగిపోయి మునిగిపోయి రాయిలా అయిపోయినటువంటి ఈ యొక్క ఎరుక - నా యొక్క అంతఃకరణని తడపడం కోసం అంటే లిటరల్ మీనింగ్ అంటారు.

నిజంగా తడుపుతున్నామా? తడపడం కాదు. భక్తిని ప్రేరేపిస్తున్నాము. ఎలాగా? నీరు, మంత్రం - "ఓం కేశవాయ స్వాహా!" అని మంత్రం. ఈ మంత్రంతో ఈ నీటిని కేశవుడికి అర్పిస్తున్నాను. నేను కాదు తాగుతున్నది. నా ముఖంలో వాగ్భవ కూటంలో ప్రపంచంనుండి జ్ఞానాన్ని స్వీకరించేటటువంటి శక్తిని నాకు అనుగ్రహించే ఆ కేశవుడికి నేను అర్పిస్తున్నాను. కేశవా! తాగు నాయనా!

స్వాహా ఎందుకొచ్చింది? స్వాహా అగ్నిబీజం. అంటే నాలో "ఈ ప్రపంచంనుండి నేను నేర్చుకోవాలి. ప్రపంచానికి నేర్పడం కోసం నేను రాలేదు. నా యొక్క నడవడికను చూసి ప్రపంచమే నేర్చుకుంటుంది. కానీ ప్రపంచంనుండి నేను నేర్చుకొనే శక్తి - నాకు ఇది వచ్చు" అని అనుకున్నానా ఇంక నేను నేర్చుకోవడానికి అవకాశం లేదు. అందుకని "నేను ఎప్పుడూ విద్యార్థిని. ఆ నేర్చుకొనే శక్తిని నాకు ఇవ్వు నాయనా !" అని తాగుతాం.

రెండోసారి పోసుకుంటాం "ఓం నారాయణాయ స్వాహా!" అని తాగుతాం. ఇక్కడ కామరాజ కూ టం అంటారు.మెడ నుండి నడుము వరుకు. కామరాజ కుటం లో ఉన్నటువంటి నారాయణుడు అంటే స్థితి కర్త. ఆ స్థితి నేను పొందినటువంటి జ్ఞానాన్ని చక్కగా పరిపూర్ణంగా అనుభవించే శక్తిని నాకు కలిగించు గాక!అని నారాయాణుడికి అర్పిస్తున్నాం.

ఇక పోతే ఈమూడోసారి తీసుకుని "ఓం మాధవాయ స్వాహా!" శక్తి కూటం అంటారు.నడుము కింద భాగం. ఈ శక్తి కూటం- శక్తి అంటే ఏమిటి? రజోగుణం - త్యాగ గుణం. నేను అనుభవించేను, అది నేను పంచుకోవాలి కూడా. కించిత్ మాత్రం నేను అనుభవిస్తాను. మిగిలినదంతా పంచుతాను. జ్ఞానాన్ని పంచుతాను, సంపదను పంచుతాను, ఆనందాన్ని పంచుతాను. పంచడం కోసమే పుట్టాను. పంచిన కొలదీ పెంచుకొనేదే జ్ఞానమూ , సంపద కూడాను. తరిగిపోదు. అందుచేత ఈ త్యాగ గుణం, రజోగుణం నాలో మాధవుడు కలిగించు గాక! మాధవా! స్వీకరించు.

ఇదే తత్వచమనం చేసేటప్పుడు "ఐం ఆత్మతత్వయా స్వాహా!", అని ఐం సరస్వతి బీజం, "క్లిమ్ విద్యా తత్వాయ స్వాహా! అని క్లిమ్ లక్ష్మి. నారాయణుడు లక్ష్మి ఒకే చోట కదా! సరిపోయింది. "సౌహు శివ తత్వాయ స్వాహా!" శివుడు ఎక్కడ ఉంటున్నాడు.? స్మశానంలోఉంటాడు. స్మశానం అంటే నిజంగా స్మశానంలో ఉంటున్నాడా? కాదు. ఇది (ఫాల భాగం -నుదురు (ఆజ్ఞాచక్రం ) స్మశానం, ఇది (మూలాధారం ) కోరిక, ఇది (హృదయం -అనాహతం) అనుభవం-. కోరిక, స్మశానం - ఇది వదిలేయడం. నాకు తెలిసిపోయింది ఇంక ఈ జీవితం ఏంటో రహస్యం తెలిసిపోయింది. అందువల్ల వదిలేస్తున్నాను నేను. ఇవన్నీ అనుభవించినవన్నీ కూడా నేను మరిచిపోయి వదిలేస్తున్నాను. అని శుద్ధ స్పటికం లాగ అంతఃకరణం చేసుకోవడమే శివ తత్వం అన్న మాట. అందుచేత ఆ జ్ఞానాన్ని నాకు మాధవుడు కలిగించుగాక , శక్తి కలిగించు గాక.

ఇకపోతే నాలుగోసారి సాధారణంగా అందరూ "ఓం గోవిందాయనమః!" అని అని చేతులు కడిగేసుకుంటారు. బ్రాహ్మణుడు గారు కూడా చేతులు కడిగేసుకోండి అంటారు. . చేతులు కడగడం కాదు ఇలా చేతిలో పోసుకుని మధ్యవేలు , ఉంగరం వేలు వీటి మధ్య నుండి నీళ్ల ని ఒక పళ్లెంలోకి వదిలెయ్యాలి. దీన్నే దేవ తర్పణం అంటారు. అంటే ఏమిటి?

గోవిందాయనమః అక్కడ స్వాహా చెప్పం. నమః అనే అంటాం. అంటే గోవిందుడు రక్షించేవాడు, భూమిని రక్షించేవాడు -ఆ భూమిని రక్షించేటటువంటి గోవిందుడు నాకు కూడా భూమిలో నావంతు పాత్రను నేను నిర్వహించ డానికి అవకాశము, శక్తి కలిగించు గాక! అంటే ఏమిటి? తనకి ఆయుష్షు, తనకి ఆరోగ్యం, "నా చిన్నిపొట్ట శ్రీరామ రక్షా అని నేను నా కోసం మాత్రమే కాదు, నా సంసారం కోసం మాత్రమే కాదు ప్రపంచం కోసం జీవించేటటువంటి అద్భుతమైనటువంటి జీవనాన్ని నాకు ప్రసాదించు గాక!" ఎవరు? గోవిందుడు. ఇలాగ కేశవా, నారాయణా, మాధవా

లోపల - గోవిందుడు బయట వీళ్ళ నలుగురికి అర్పిస్తున్నాను.

అదే తత్వాచమనం అయితే, ఐం క్లిమ్ సౌహు సర్వ తత్వేభ్యో స్వాహా! ఈ సరస్వతి, లక్ష్మి, గౌరీ ముగ్గురూ కూడా ప్రపంచం అంతా వ్యాపించి ఉన్నారు. ఆ శక్తికి నేను అర్పిస్తున్నాను.

ఇది అయిపోగానే మనం ప్రాణాయామం చేస్తాము, అక్కడ వాయువుతో సంబంధం పెట్టుకున్నాం. తరువాత ధ్యానం చేస్తాం. ధ్యానం అంటే నిశ్చలత్వం, నిశ్శబ్దం. అది ఆకాశంతో సంబంధం. ఇలాగ పంచభూతాలతో సంబంధం పెట్టుకొని దాని ద్వారా భగవంతుడిని పొందడానికి, అనుభవించడానికి చేసేటటువంటి ఉత్కృష్ట మైనటువంటి చర్యనే ఆచమనం అంటాం. మనం అందరం కూడా ఇకమీదట ఆచమనం చేసేటపుడు ఈ అంతరార్థాన్ని గ్రహించి, భావంతో కేశవా ! నువ్వు తీసుకో నాయనా ! అన్న ఆర్తితో మీరు ఆచమనం చేయండి. ఒక్క పూజలో మీకు మహదానందం కలుగుతుంది.

శ్రీమాత్రే నమః



## గురువాణి

శ్రీవిద్యా జ్ఞాన పీఠం

# కాంచీపురంలో నిర్మించబడే శ్రీ విద్యా జ్ఞాన పీఠమునకు తోడ్పడండి!

**శ్రీ మాత్రే నమః**

అన్ని విద్యలలో కెల్లా గొప్పది శ్రీవిద్య అని చెప్పబడుతుంది. ఎందుకంటే, దీనిలో ప్రాపంచిక, ఆధ్యాత్మిక లక్ష్యాలను చేరుకునే పద్ధతులు, అవకాశాలు మెండుగా ఉంటాయి. ఇటువంటి శ్రీవిద్యను అందరికీ నేర్పేవారు కరువైపోవడమే కాదు, ఆ విద్యను శాస్త్రబద్ధమైన రీతిలో ఉపాసన చేయడానికి అనువైన ప్రదేశాలు కూడా తగ్గిపోయాయి. ఏ ఉపాసన అయినా ఏదైనా క్షేత్రంలో చేస్తే ఫలితం ఎక్కువగా ఉంటుందని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి.

ఈ లోటును తీర్చడానికా అన్నట్లు సుప్రసిద్ధ శక్తి పీఠములలో ఒకటైన కాంచీపురంలో 9 ఎకరాల విస్తీర్ణంలో ప్రసిద్ధ శ్రీ విద్యా ఉపాసకులైన శ్రీ గురు కరుణామయ గారిచే ఒక శ్రీ విద్యా జ్ఞాన పీఠము నిర్మించబడుతున్నది.

ఇందులో, శ్రీ విద్య ప్రధాన దేవత అయిన రాజరాజేశ్వరి, సదాశివునిమీద ఆశీనురాలై, 9 అడుగుల ఎత్తు గల విగ్రహ రూపంలో భక్తులను అనుగ్రహిస్తుంది. అమ్మవారికి ఇరువైపులా 5 అడుగుల ఎత్తు గల విగ్రహ రూపంలో రాజశ్యామల, వారాహీ దేవతలు భక్తులలో ఆకర్షణ శక్తిని పెంచి, వారిని వ్యతిరేక శక్తులనుండి (నెగెటివ్ ఎనర్జీ) కాపాడుతూ ఉంటారు.

అంతే కాదు. సంప్రదాయ రీతులలో విశాలంగా నిర్మించబడే యాగశాలలో అన్ని రకాల హోమ గుండములు, నిర్మాణం చేయబడతాయి. వీటితోబాటు, ఒక పెద్ద గోశాల, రెండు పుష్కరిణులు, వాటి చుట్టూ ఉపాసకులు కూర్చుని ధ్యానం చేసుకోవడానికి వసతులు, చిత్రాలలో చూపించిన విధంగా నిర్మించబడతాయి.

నక్షత్రవనం, ఔషధ వనాలతో పాటు, శాస్త్రములలో చెప్పబడిన శ్రీ విద్యా సాధనకు సంబంధించిన అన్ని పుష్ప,ఫల, పత్ర వృక్షములు 3 ఎకరాల స్థలంలో పెంచబడతాయి. ఈ వనంలో నడిస్తే, అనేక ఆరోగ్య సమస్యలు తీరడమే కాకుండా, గ్రహ సంబంధమైన సమస్యలు కూడా పరిష్కరించబడతాయి అని నమ్మకము.

వీటన్నింటితో బాటు, ఆసక్తి గల సాధకులు శాశ్వతంగా ఉండి ఉపాసన చేసుకోవడానికి, లేదా సంవత్సరంలో కొంత కాలం ఉండడానికి వీలుగా ప్రత్యేక వసతి గృహాలు నిర్మించబడతాయి.

కావున, భక్తులెల్లరూ ఈ బృహత్సంకల్పానికి దోహదపడుతూ, శ్రీవిద్యా ఉపాసకులకు మాత్రమే కాకుండా, పామర జనానికి కూడా ఉపయోగ పడే ఈ అద్భుత పీఠ నిర్మాణానికి ఇతోధికంగా విరాళాలు అందించి సహాయ పడవలసిందిగా వినమ్రంగా అర్థిస్తున్నాము.





దాతలు దిగువ ఇవ్వ బడిన QR code ను scan చేసి, విరాళాలు శ్రీ విద్యా లెర్నింగ్ సెంటర్ యొక్క యాక్సిస్ బ్యాంక్ అకౌంట్ నందు జమచేయవచ్చును. మరిన్ని వివరములకు 8088256632, 9951998444, 8861858899 లలో ఏదైనా ఒక ఫోన్ నంబర్ ద్వారా సంప్రదించగలరు.

డొనేషన్ ఇచ్చెడివారు వారివారి చిరునామా ఇచ్చినచో అమ్మవారి ప్రసాదము పంపించగలము



గురువాణి
శ్రీవిద్యా సాధన



# శ్రీచక్ర నవావరణ పూజ

# నవావరణార్చన

శ్రీ చక్రమునందు ఉన్న 44 మంది దేవతలను ప్రత్యేకముగా పూజించే విధానమే ఈ నవావరణార్చన. ప్రతి పూజలోనూ చేస్తున్న విధంగానే క్రింద తెలిపిన వరుసలో పూజను ప్రారంభించవలెను.

- గురుధ్యానము
- గణపతి ధ్యానము
- ఆచమనము
- ప్రాణాయామము
- సంకల్పము

మమ ఉపాత్త సమస్త దురిత క్షయ ద్వారా, శ్రీ లలితా పరమేశ్వరీ దేవతాముద్దిశ్య, శ్రీ లలితా పరమేశ్వరీ దేవతా ప్రీత్యర్థం శ్రీ చక్ర నవావరణార్చనం కరిష్యే.
అని సంకల్పము చేసిన తరువాత ఉపచార పూజలు చేయవలెను.

1. ధ్యానం
ఐం హ్రీం శ్రీం శ్రీ లలితా పరమేశ్వరీ దేవతాయై నమః ధ్యాయామి.

2. ఆవాహనం
ఐం హ్రీం శ్రీం శ్రీ లలితా పరమేశ్వరీ దేవతాయై నమః ఆవాహయామి.

3. ఆసనం
ఐం హ్రీం శ్రీం శ్రీ లలితా పరమేశ్వరీ దేవతాయై నమః నవరత్న ఖచిత సింహాసనం కల్పయామి నమః

4. పాద్యం
ఐం హ్రీం శ్రీం శ్రీ లలితా పరమేశ్వరీ దేవతాయై నమః పాదయోః పాద్యం కల్పయామి నమః

5. అర్ఘ్యం
ఐం హ్రీం శ్రీం శ్రీ లలితా పరమేశ్వరీ దేవతాయై నమః హస్తయోః అర్ఘ్యం కల్పయామి నమః

6. ఆచమనం
ఐం హ్రీం శ్రీం శ్రీ లలితా పరమేశ్వరీ దేవతాయై నమః ముఖే శుద్ధ ఆచమనం కల్పయామి నమః

7. స్నానం
ఐం హ్రీం శ్రీం శ్రీ లలితా పరమేశ్వరీ దేవతాయై నమః స్నపయామి.

8. వస్త్రం
ఐం హ్రీం శ్రీం శ్రీ లలితా పరమేశ్వరీ దేవతాయై నమః వస్త్రం కల్పయామి నమః

9. గంధం
ఐం హ్రీం శ్రీం శ్రీ లలితా పరమేశ్వరీ దేవతాయై నమః గంధం కల్పయామి నమః

10. పుష్పం
ఐం హ్రీం శ్రీం శ్రీ లలితా పరమేశ్వరీ దేవతాయై నమః పుష్పం కల్పయామి నమః

ఇక్కడి నుండి ఆవరణ దేవతల పూజార్చనం ప్రారంభం అవుతుంది.

4వ ఆవరణమునందు మన వైపు ఎదురుగా ఉన్న కోణము దగ్గర మొదలుపెట్టి, అపసవ్యముగా వెళుతూ, పూజార్చనం చేయవలెను. ఈ విధముగా, వరుసగా ఆవరణములయందు పూజార్చనం పూర్తి చేసుకుని, బిందు స్థానమునకు చేరుకోవలెను.

పంచపాత్రలోని నీటితో, గంధమును వేరొక పాత్రలో కలుపుకొని, 4వ ఆవరణలో (అనగా, 14 త్రికోణములతో ఉన్న ఆవరణ) మన వైపు ఎదురుగా ఉన్న కోణము దగ్గర మొదలు పెట్టి, అపసవ్యముగా వెళుతూ, మంత్రములు చదువుతూ(మంత్రములతో కూడిన పూర్తి పూజా విధానము వెబ్ సైట్ నందు పొందుపరచబడినది) ఆయా స్థానములలో గంధపు చుక్కలు పెడుతూ పూజ చేయవలెను. ప్రతి ఆవరణ లోనూ ఇదే విధముగా చేస్తూ, బిందు స్థానము వరకు చేరుకోవలెను.

4వ ఆవరణ – 14 కోణములు
(త్రికోణములతో మొదలయ్యే మొదటి ఆవరణ)

5 వ ఆవరణ – 10 కోణములు
6 వ ఆవరణ – 10 కోణములు
7 వ ఆవరణ – 8 కోణములు
8 వ ఆవరణ – మధ్య త్రికోణము
9 ఆవరణ – బిందు
10. బిందువు, మరియు త్రికోణము

ఇక్కడితో ఆవరణ దేవతలను గంధంతో అర్చించుట పూర్తి యగును.
11. ధూపం
12. దీపం
13. నైవేద్యం

మధ్యే మధ్యే పానీయం సమర్పయామి
అమృతాపిధానమసి ఉత్తరాపోశనం సమర్పయామి
హస్తౌ ప్రక్షాళయామి
పాదౌ ప్రక్షాళయామి
ఆచమనీయం సమర్పయామి


14. నీరాజనం
“రక్షాం ధారయామి”

15. మంత్రపుష్పం
16. పూజా సమర్పణం


పూజాసమర్పణంతో నవావరణార్చన సంపూర్ణం అవుతుంది.
ఓం శాంతిః శాంతిః శాంతిః

పూర్తి నవావరణార్చన పూజ ఫైల్ డౌన్‌లోడ్ చేసుకోండి.

సంపుటి -1 సంచిక 9



# పళని సుబ్రహ్మణ్య స్వామి ఆలయం





# పళని శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆలయం

**మనలో చాలామందికి సంతానము కలగక పోవడము లేదా పుట్టిన సంతానము చెప్పిన మాట వినకుండా, సరైన దారిలో నడవకుండా బాధ పెట్టడము, లేదా భార్యా భర్తల అనుబంధం లోపించడము.. ఇటువంటి సమస్యలు కలగడం తరచుగా చూస్తూ ఉంటాము. స్వాధిష్ఠాన చక్రములో విశ్వశక్తి(కాస్మిక్ ఎనర్జీ) ప్రసరణ సరిగా జరుగకపోవడం వలన ఇటువంటి దోషములు కలుగుతాయి. వీటినే సర్పదోషమని, సర్ప శాపమని, చెబుతూ ఉంటారు. వీటికి పరిహారంగా, బాలాత్రిపుర సుందరిని గానీ, సర్పమును అదుపులో ఉంచే నెమలిని వాహనముగా గలిగిన బాలసుబ్రహ్మణ్య స్వామిని గానీ పూజించడం మంచిది. బాలసుబ్రహ్మణ్య స్వామికి తమిళనాడులో ప్రత్యేకించి ఆరు దివ్య క్షేత్రాలు కలవు. వాటిని "ఆరుపడై" అంటారు. వీటిలో ఒకటి అందరికీ సుప్రసిద్ధమైన పళని దేవాలయము.**

ఈ దేవాలయం తమిళనాడులోని దిండిగల్ జిల్లాలో దేవాలయం ఉన్నది. ఇది, అటు చరిత్రకు, ఇటు శాస్త్రానికి అందని అసాధారాణ నైపుణ్యానికి, విజ్ఞానానికి తార్కాణం. దేశంలో ఏ విగ్రహమైనా రాయి లేదా లోహముతో మలచినదే కదా. కానీ ఇక్కడ ఉన్న విగ్రహం తొమ్మిది రకాల విష పదార్థాలతో "భోగర్" అని సిద్ధుడు తయారు చేశాడు. అందుకే దీనిని నవపాషాణ విగ్రహం అంటారు. విషపూరితమైన 64 మూలికలలో 9 మూలికలు సేకరించి, వాటితో చేసిన ఈ విగ్రహానికి అభిషేకం చేసిన తరువాత వచ్చిన తీర్థము సేవిస్తే, ఎటువంటి రోగాలైనా తగ్గుతాయని నమ్మకం. అంతే కాదు. పూర్వకాలంలో స్వామి వారి ఊరువు భాగం నుండి తీసిచ్చిన విభూదితో కుష్ఠు రోగం కూడా నయమయ్యేదట.

చేతిలో దండం పట్టుకుని ఉన్న బాల సుబ్రహ్మణ్య స్వామి ఈ ఆలయం గర్భగుడిలో దర్శనం ఇస్తాడు. ఇక్కడి స్వామిని దండాయుధ పాణి, దండపాణి, బాల సుబ్రహ్మణ్యం, మురుగన్, శరవణన్....ఇలా రకరకాల పేర్లతో కొలుస్తారు.

ఇంకొక విచిత్రమేమిటంటే, రాత్రివేళ గంధాన్ని పట్టించి వదిలివేస్తే ఉదయానికల్లా కరిగిపోతుంది. పైగా విగ్రహానికి స్వేదం పట్టి, గంధంతో పాటు కారిన నీటి చుక్కలు ఆకుపచ్చ రంగులో ఉంటాయి. దీనిని ఒక గిన్నెలో ఒడిసిపట్టి, ఎన్నో రోగాలకు మందులాగా ఉపయోగిస్తారు. దీనిని కౌపీన తీర్థం అంటారు.




స్వామి వారి విగ్రహాన్ని తయారుచేసిన భోగర్ అనే సిద్ధుడు విగ్రహం ఉన్న కొండ క్రిందనే జీవసమాధికి వెళ్లిపోయారు.

ఈ ఆలయానికి మరో ప్రత్యేకత ఏమిటంటే ప్రతి రోజూ ఈ గుడి నిరవధికంగా 16 గంటల పాటు తెరిచి ఉంచబడుతుంది.

క్రీస్తుపూర్వం 3000 సంవత్సరాల నాటి విగ్రహం నిర్లక్ష్యానికి గుర్తై పోగా, చేరరాజు చేరమాన్ పెరుమాళ్ వారి సుబ్రహ్మణ్య స్వామి కలలో కనబడి, తనని పునఃప్రతిష్ఠించమని చెప్పినట్లు చెబుతారు.

ఇక్కడ స్కంద షష్ఠి ఉత్సవాల్లో భాగంగా కావడి ఉత్సవం జరుగుతుంది. సంతానప్రాప్తి కోసం భక్తులు, ఈ కావడి ఉత్సవంలో పాల్గొని, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరునికి పూజలు చేస్తారు. లడ్డూ ప్రసాదం అంటే తిరుపతి వెంకన్న గుర్తు వచ్చినట్లే పంచామృతం పేరు చెప్పగానే భక్తులకు గుర్తుకు వచ్చేది పళని స్వామి ప్రసాదం. మహత్తరమైన రుచి, ఔషధగుణాలు ఉన్న ప్రసాదం. ఇది నెలలపాటు నిలవ ఉంటుంది. పళని కొండలలో విరూపాచ్చి అనే గ్రామంలో మాత్రమే పండే, వేలెడంత సైజులో ఉండే అరటిపళ్లను చిదిమి, దానికి కంజీయం ప్రాంతంలో పండించే చెఱకు తో చేసిన ముడి పంచదార చేర్చి, ఖర్జూరాలు, ఎండు ద్రాక్ష, యాలకులు, నెయ్యి వేసి ఈ ప్రసాదం తయారు చేస్తారు.

ఇక్కడ తైపూసం, వైకాశి, అగ్ని నక్షత్రం వంటి రకరకాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించబడతాయి.



పళని సుబ్రహ్మణ్య స్వామి దేవాలయం, మదురై నుండి 120 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఎత్తైన కొండమీద ఉన్న ఈ క్షేత్రానికి చేరుకునేందుకు మెట్ల మార్గంతో పాటు రోప్ వే లాంటి సౌకర్యము కూడా ఉన్నది.

## స్థల పురాణం

ప్రమథ గణాధిపత్యం కొరకు జరిగిన పరీక్షలో ఓడిన కుమారస్వామి, ప్రస్తుతం పళని ఆలయం ఉన్న పర్వతం మీదకు చేరుకుని, అక్కడే ఉన్నాడు. పార్వతీ పరమేశ్వరులు అక్కడికి వచ్చి,నీవే జ్ఞాన ఫలము అని బుజ్జగిస్తారు(పళంనీయప్పా అన్న పాట ఇక్కడి సందర్భంలో చెప్పుకుంటారు. తమిళంలో పళం అంటే ఫలము నీ అంటే నువ్వు అప్పా అంటే బిడ్డ అని అర్థము). అప్పటి నుండి సుబ్రహ్మణ్యస్వామి ఇక్కడే కొలువై ఉన్నాడు.


స్వామి విశ్వరూప దర్శనం


అలంకరణ అనంతరం స్వామివారు


పళని పంచామృత ప్రసాదం


కావడీ ఉత్సవం


పళని రోప్ కార్

## కావడీ ఉత్సవం

దేవదానవ సంగ్రామ సమయంలో ఇడుంబుడు అనే రాక్షసుడు ప్రాణాలు కాపాడమని అగస్త్య మహాముని దగ్గరకు వస్తాడు. శరణు కోరిన వాడిని చంపడం భావ్యం కాదని భావించిన ఆ ఋషి, కుమారస్వామి సలహా మేరకు, కైలాసం నుండి రెండు కొండలు తీసుకురమ్మని ఇడుంబునితో చెబుతాడు. అతడు కైలాసం దగ్గర నుండి, శివగిరి, శక్తిగిరి అనే రెండు పర్వతాలను కావడిలో భూమి మీదకు తీసుకువస్తాడు. మార్గమధ్యంలో పళని అనే ప్రాంతానికి వచ్చినప్పుడు, కావడిని క్రిందపెట్టి, సేదతీరతాడు. మరలా లేచి కావడిని తీసుకోవడానికి ప్రయత్నిస్తే, కొండలు కదలలేదు. అక్కడే ఉన్న కుమారస్వామి అది చూసి నవ్వుతాడు.

కుమారస్వామితో యుద్ధంలో ఓడిపోయిన ఇడుంబుడిని క్షమించి, కావడీతో ఈ కొండమీదకు నడుచుకుంటూ వచ్చిన భక్తులకు యజ్ఞఫలం దక్కుతుందని కుమారస్వామి చెబుతాడు. నీ వల్లనే కావడి సంప్రదాయం మొదలైంది కనుక, భక్తులు ముందు నిన్ను దర్శించుకున్న తరువాతే నన్ను దర్శించుకుంటారు అని కుమారస్వామి వరమిస్తాడు.

## తెరచి ఉంచు వేళలుః

ఉదయం 4.00 గం. ల నుండి రాత్రి 10.00 గం.ల వరకు (16 గంటలు)

## చిరునామా & సంప్రదింపు ఫోన్:

జాయింట్ కమీషనర్,
అరుళ్ మిగు దండాయుధపాణి తిరుక్కోవిల్,
పళని – 624601.

ఫోన్ నంబర్లు – 04545 241417
04545 242236

## ఈ ప్రదేశానికి ఎలా చేరుకోవాలి:

దగ్గర విమానాశ్రయం – కోయంబత్తూర్ లేదా మదురై .
అక్కడి నుండి 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న పళని బస్సులో చేరుకోవలెను.

రైలు మార్గం – పళని ఎక్స్ ప్రెస్, అమృతా ఎక్స్ ప్రెస్ లలో కోయంబత్తూర్ వరకు చేరుకోవచ్చు.

సంపుటి -1 సంచిక 9
సంబంధ బాంధవ్యాలు (మొదటి భాగము)



# భార్యా భర్తల మధ్య సంబంధాలు మెరుగుపడటానికి అద్భుత పరిష్కారాలు

**చిన్న చిన్న వాటికి విడాకుల వరకు మన భారతీయులు వెళ్ళరు, కష్టం చిన్నదా పెద్దదా అని మనం చెప్పలేము.ఎవరి కష్టాలు వారికే అవగాహన ఉంటుంది, మానసికంగా శారీరకంగా పెట్టే కష్టాలు భరించలేక వివాహం నుండి బయటకి వచ్చేస్తారు. ఒకరకంగా ఒక జీవిగా వారి బాధ సరి అయినదే, కానీ తీసుకునే సమయం, దాని పర్యవసానం ఒక్కసారి ఆలోచించుకోవాలి.**

మనం పెళ్లి చేసుకునే ముందే సర్దుబాటు కోసమే నేను పెళ్లి చేసుకుంటున్నాను అనే విషయాన్ని అర్థం చేసుకోవాలి.. నేను అనుకున్నట్టు ప్రపంచం ఉండదు, నా భర్త/భార్య పిల్లలు నేను మారడం కోసం వచ్చిన ఉపాధులు, కానీ నేను వారిని మార్చడం కోసం పుట్ట లేదు అన్న విషయం సత్యం అని అర్థం చేసుకోవాలి.

పుణ్యం కొద్ది పురుషుడు పూజల కొద్దీ పిల్లలు అని మనం చెప్పుకుంటూ ఉంటాం, పూర్వ కాలం లో సీతా రాములు ఉన్నారు, పూర్వం సీతా దేవి పెళ్లి అయిన పదహారు రోజులకే భర్త వనవాసం వెళుతున్నాను అంటే "ఏమిటండి హనీమూన్ కి వెళ్ళకుండా, వెళ్లక వెళ్లక అడివికా వెళ్లేది!" అని గోల పెట్టలేదు, ఆయన నార వస్త్రాలు కట్టుకుంటే, ఆమె కూడా నార చీరలు కట్టుకుంది.

మనని మనం తగినట్లు మార్చుకోవడం, సర్దుకుని కలిసి ఆనందంగా జీవించడం, పోరాటాలు లేకుండా కలిసి మెలగడం మనం రామాయణం నుంచి నేర్చుకోవాలి. ద్రౌపది పతివ్రత గా నిలిచింది, ఎలా ఉన్నా నేను సర్దుకుని ఉంటాను అని జీవించింది కాబట్టి. అలాగే, పుండరీకుడి విషయంలో కూడా వేశ్యాలోలుడై, తలిదండ్రులను, భార్యను అలక్ష్య పరచినప్పుడు కూడా, సహనం తో ఎదుర్కోవడం మనం గమనిస్తాము. అంత వరకు మనం వెళ్ల లేక పోవచ్చు, కాని కొన్ని పరిస్థితులలో మనం భరించలేనటువంటి పరిస్థితి వచ్చి మనం విడిచిపెట్టాలి అని మనం విడాకులు తీసుకోవాలి అని ఆలోచన వచ్చినప్పుడు మగవారు కానీ ఆడవాళ్ళు కానీ, ఒక కాగితం , పెన్ను తీసుకుని వారి భార్యలో కానీ భర్తలో కానీ నచ్చని విషయాలు వ్రాయండి.

చిన్న విషయాలు కూడా ఉదాహరణకి వారు  అన్నం తినే విధానం నాకు చికాకు, కాఫీ తాగే పద్ధతి నచ్చదు, మాసిన బట్టలు వేసుకుంటారు లాంటి చిన్న విషయాలు కూడా రాసేయ్యండి. పెద్ద కారణాలూ ఉంటాయి, లేవు అనను కానీ అన్నీ రాసేసుకోండి, పక్కన పెట్టండి.

విడాకులు తీసుకున్నాక నా పరిస్థితి ఏంటి? పిల్లలు ఉంటే వారి విషయం, మళ్లీ పెళ్లి చేసుకోవాలి అనే ఆలోచన ఉంటే అది కూడా రాసుకోండి, చేసుకోను అనుకుంటే పిల్లల్ని పెంచే స్థితి , ఆధారం ఉందా? పిల్లలు పెద్ద అయ్యాక నేను ఒంటరిగా గడపగలనా? ఒంటరి జీవితం నాకు ఫరవాలేదా? లేదూ, ఒంటరిగా గడపలేను అనుకుంటే మళ్లీ విడాకులు ఆలోచన నుండి వెనక్కి వచ్చేయండి. సర్దుకొని జీవితం గడపండి, మన జాబితా (లిస్టు) విషయం తర్వాత చూద్దాం.

అలా కాకుండా నేను మళ్ళీ పెళ్లి చేసుకుంటా అని అనుకున్నారు అనుకుందాం. కానీ మనం సాదారణంగా చూసే ప్రపంచం లో మళ్లీ పెళ్లి చేసుకునే వారికి దొరికే వారు కూడా వారి పెళ్లిలో ఫెయిల్ అయిన వారే దొరుకుతున్నారు. కొత్తగా పెళ్లి చేసుకునే వాళ్ళు దొరకడం చాలా అరుదు.

అంటే, వేరే వారి ద్వారా తిరస్కరించబడిన వారు, లేదా సర్దుకొని గడపలేని వారే దొరుకుతారు. అప్పుడు వారు మనతో సర్దుకుని ఉంటారు అని, ఏమిటి హామీ? తెలియని మిత్రుడి కంటే తెలిసిన శత్రువు మేలు.కాబట్టి మనం ఆలోచించుకోవాలి. "ఈవిడ/ఈయన గురించి నాకు తెలిసింది, ఏమి చేస్తే కోపం వస్తుంది, ఎలా ఉంటారు అన్న అవగాహన వచ్చింది, కాస్త సర్దుకుంటే మిగిలిన జీవితం ప్రశాంతంగా ఉంటుంది కదా!

అదీకాక, వీటిని సహనంతో ఎదుర్కోవడం వలన కర్మప్రక్షాళనం అవుతుంది. కర్మను తప్పించుకోవడం హరిబ్రహ్మరుద్రాదులకు కూడా సాధ్యం కాదు అని శాస్త్రం చెబుతున్నది కదా. ప్రతి ఒక్కరిలోనూ ఎంతో కొంత చెడు ఎంతో కొంత మంచి ఉంటుంది. "దృష్టదోషేపి విషయే మమత్వా కృష్ణ మానసా" అని చండీ పాఠంలో చెప్పినట్లు, తామసిక మనస్సు ఎప్పుడూ ఎదుటి మనిషిలోని చెడు గురించే ఆలోచిస్తూ ఉంటుంది. అలా కాకుండా, మనం మంచిని మాత్రం గమనిస్తే మనశ్శాంతి మన దగ్గరే ఉంటుంది.

అందుకని మళ్ళీ ఈ జాబితా పట్టుకోండి. కొన్ని విషయాలు మనం సర్దుబాటు ఎలా అవ్వాలో, అవచ్చో చూసుకోండి. మిగిలిన విషయాల గురించి పూర్తి స్థాయిలో మీ భార్య/భర్త తో చర్చించండి. విపులంగా మాట్లాడండి కాని నెగెటివ్ విషయం తో మొదలు పెట్టకండి, ముందు గా పాజిటివ్ విషయాలు "ఏవండి మీరు చాలా మంచివారు చాలా మంది తో పోలిస్తే మీరు నన్ను బాగా చూస్తారు కానీ కోపం ఎక్కువ అరుస్తారు, నా తప్పు ఉంటే చెప్పండి, అలా కొప్పడకండి" అని చెప్పండి.

ఒక్క విషయం వదిలేస్తే జీవితం ప్రశాంతం గా ఉంటుందంటే, దాన్ని వదిలేయండి. కొన్ని చెప్పండి. ఒకప్పుడు మన అదృష్టం బాగుంటే వింటారు, వినరూ అప్పుడు కూడా పిల్లలు ముఖ్యం కాబట్టి, సర్దుబాటు అవ్వండి,స్పందించకండి.

రేపు ఎవ్వరు రారు మనకోసం ఈ రోజు ఉన్న తల్లి తండ్రులు, స్నేహితులు రేపు మన జీవితాన్ని చక్క దిద్దడానికి రారు. మన జీవితాన్ని మనమే చూసుకోవాలి అని గుర్తు చేసుకోండి. అప్పుడు తప్పు చేశానే అని బాధపడే పరిస్థితి రాకూడదు. సర్దుబాటు అవండి.

మరొక విషయం. మనం ఉద్యోగం లో పై అధికారి దగ్గర సర్దుకుపోతున్నాం కదా! తిరగబడం కదా!ఎందుకు ఉద్యోగం పోతుందేమో! అని. అలాగే, జీవిత భాగస్వామితో కూడా సర్దుకుపోండి. ఎందుకంటే, జీవితం పోతుందేమో అనే భయం ఉండాలి.

ఇంకొక విషయం. భార్య భర్తలు అయిన తరువాత ఒకరి మీద ఒకరికి అధికార భావన ఏర్పడటం లోపం. ఇది నా సొత్తు ఎక్కడికి వెళతారు, పడి ఉంటారు అనే ఆలోచన తో "టేక్ ఇట్ ఫర్ గ్రాంటెడ్" గా తీసుకుంటాం కాబట్టి .అందువల్లే ఈ లోపాలు అన్నీ వస్తున్నాయి. బయట ఎంత గౌరవం గా ఉంటారు, స్నేహితులు తప్పు చేస్తే ఊరుకుంటారు, మరి మన వాళ్ళు తప్పు చేస్తే ఎందుకు స్పందిస్తారు ? బయట వారికి ఇచ్చే గౌరవం ఇంట్లోని మన వారికి ఇవ్వాలి కదా !

అన్నీ మాట్లాడుకున్నాక పడుకునే ముందు ఒక ధ్యానమో జపమో చేసుకొని ఇద్దరు పడుకోండి. ఎవరికీ అయినా కౌన్సెలింగ్ కావాలి అంటే అమ్మ దగ్గరికి రండి, ఎన్నో విడాకుల కేసులు ఆపింది అమ్మవారు. మలేషియా, సింగపూర్ లో కూడా విడాకుల కోసం కోర్టు వరకు వెళ్లిన వారు కూడా అమ్మ దయ వల్ల మళ్ళీ కలిసారు, కారణం సర్దుబాటు. సర్దుకుపోవడమే కారణం అని మర్చిపోకండి, ఎవరో ఒకరు సర్దుబాటు అవ్వాలి.

పూర్వకాలం అమ్మమ్మల నానమ్మ కాలంలో అసలు విడాకులు అన్న పదమే లేదు. పరిత్యజించటం అనే వారు కానీ ఎక్కడో తప్ప శాస్త్రం లో మనం చూడలేదు కానీ ఇప్పుడు ప్రేమ వివాహంలో కూడా, నెల రోజులలోనే విడాకులు ఎందుకు వస్తునాయి అంటే expectations వల్ల. భార్య/భర్త అలానే ఉండాలి ఇలానే ఉండాలి అనే ఆలోచన వల్ల. పెళ్లికి ముందు, పెళ్లి అయిన కొత్తల్లో అంటారు "చంద్రుణ్ణి తెస్తాను" అని, కానీ తరువాత "కొట్టుకి వెళ్లి పాలు తీసుకురండి" అని చెప్పండి, వెళ్లరు. దానికి మానసికంగా సిద్ధపడండి. మీకు మీరు ఆనందం గా ఉండండి. మీకు సంగీతం వచ్చినట్టు అయితే పాటలు పాడుకోండి. నాట్యం (డాన్స్ ) ఇష్టం అయితే నాట్యం చేయండి. ప్రకృతి ఆస్వాదన ఇష్టం అయితే ప్రకృతి ఆస్వాదించండి. మీరు సంతోషంగా గడపడానికి మీకంటూ ఒక లోకం ఉండాలి. 'కూర్మ పృష్ఠ జయిష్ణు ప్రపదాన్వితా' అని లలితా సహస్ర నామంలో చెప్పబడింది. అంటే, తాబేలు ఎలాగైతే శత్రువు రాగానే లోపలికి వెళ్లిపోతుందో, అలానే దాంపత్యం ఆనందం గా ఉంటే ఆనందంగా ఆస్వాదించండి. లేదంటే తాబేలులా మీ లోపలి ఆనంద లోకంలోకి వెళ్ళిపోండి. గొడవలు, వాదనలు చేయకండి. ఎందుకు ఈ వాదనలు వల్లే ఒక వారం రోజులు, నెల రోజులు నేను కష్టం అనుభవిస్తున్నాను అనే కాస్త ఎరుక ఇద్దరికీ ఉండాలి. అలా ఉంటే విడాకులు ఖచ్చితంగా తగ్గుతాయి.

భార్యాభర్తల అనుబంధ అభివృద్ధి కోసం లలితా సహస్రనామంలో మంత్రపూరితమైన కొన్ని వాక్యములు ఉన్నాయి. వీటితో సంపుటీకరణ చేసి, లలితా సహ్రనామం చదువుకుంటే చాలావరకూ మెరుగు కనబడుతుంది.

- మందస్మిత ప్రభాపూర మజ్జత్కామేశ మానసా
  (ఆడియో లింక్)
- కామేశ్వర ప్రేమరత్న మణిప్రతిఫణస్థనీ
  (ఆడియో లింక్)
- శివకామేశ్వరాంకస్థా శివా స్వాధీన వల్లభా
  (ఆడియో లింక్)
- దుష్టదూరా దురాచార శమనీ దోష వర్జితా
  (ఆడియో లింక్)
- స్వాత్మానందలవీభూత బ్రహ్మాద్యానంద సంతతిః
  (ఆడియో లింక్)
- కామేశ్వర ప్రాణనాడీ కృతజ్ఞా కామపూజితా
  (ఆడియో లింక్)
- శివప్రియా శివపరా శిష్టేష్టా శిష్ట పూజితా
  (ఆడియో లింక్)
- మహాకామేశ నయన కుముదాహ్లాద కౌముదీ
  (ఆడియో లింక్)
- సంసార పంక నిర్మగ్న సముద్ధరణ పండితా
  (ఆడియో లింక్)

**గమనిక: ఈ శీర్షిక కింద కొన్ని వ్యాసాలు వరుసగా వస్తాయి.**

# గురూజీతో నా అనుభవాలు

శ్రీమతి వైదేహి కందాల



**శ్రీ మాత్రే నమః**

నేను దత్త అవతార ఉపాసికను. షిర్డీ సాయి, నృసింహ సరస్వతి, స్వామి సమర్థులు మరియు శ్రీపాద శ్రీవల్లభ స్వామి వారి దత్తావతార పారాయణాలు అప్పటికి సుమారు ఒక సంవత్సరం పాటు గా చేస్తూ ఉన్నాను. నా దృష్టి ఎప్పుడూ అచంచలమైనదిగా ఉండేది. కనుక నన్ను నేను పూజలు, వ్రతాలు మొదలైన ఆచారములకు బద్ధురాలిని కాని దత్త ఉపాసికనని భావించాను. నేను శ్రీ పాద శ్రీ వల్లభ చరిత్ర చదువుతున్నప్పుడు, దశమహా విద్యల గురించి చదివాను. దేవి గురించి మరింత తెలుసుకోవాలనే ఆకర్షితురాలినయ్యాను. దేవీ ఉపాసనలో శ్రీ విద్యా ఉపాసన అత్యున్నత స్థాయి అని కూడా ఈ పుస్తకంలో చదివాను.

దానితో నేను మరింత పరిశోధించాను. కానీ ఈ ఉపాసనను స్వీకరించడానికి నేను సిద్ధంగా ఉన్నానా లేదా అని నిర్ణయించుకున్నానో లేదో నాకు ఖచ్చితంగా తెలియలేదు. కాబట్టి నేను దత్త పారాయణాలను కొనసాగించాను. ఇది నవంబర్ 2020లో జరిగింది. ఈ అంశం నా మనస్సులో పదే పదే గోచరము అవుతూ ఉండేది. నేను శ్రీ విద్యా గురించి పరిశోధిస్తున్నసమయంలో నాకు సౌందర్య లహరి వెబ్‌సైట్ మరియు గురు కరుణామయ ఫేస్‌బుక్ పేజీ కనిపించాయి. నేను గురూజీకి నా ఆధ్యాత్మిక ప్రయాణం గురించి మెసేజ్ చేసాను. గురూజీ స్పందిస్తూ నేను సరైన దారిలోనే ఉన్నాను అని మరియు త్వరలో జరగనున్న మాడ్యూల్ 1 & 2 లో చేరవలసినదిగా చెప్పారు.

నేను 2021లో జనవరి క్లాస్‌లో చేరడానికి ముందు నేను సిద్ధంగా ఉన్నానా లేదా అని ఒక నెల రోజులు వేచి ఉన్నా నాకు ఇంకా ఖచ్చితంగా తెలియలేదు. అయినా అదే ఆలోచనతో మాడ్యూల్ 1 & 2 లో యధాలాపముగా జాయిన్ అయ్యాను.

ఆ మూడు రోజుల క్లాసులు చాలా స్పూర్తిదాయకంగా మరియు దైవికంగా జరిగాయి. నేను శ్రీ విద్య గురించి చాలా నేర్చుకోగలిగినందుకు చాలా ఆశీర్వదించబడ్డాను మరియు ఇక్కడ చెప్పబడిన పూజలు, తర్పణాలు, హోమాలు మరియు జపాలను ప్రారంభించడం పట్ల ఎంతో ఉత్సాహం చూపాను. నిర్దేశించిన 41 రోజులు గణపతి తర్పణము పూర్తి చేయడమే కాకుండా గణపతి హోమం చేస్తూ 10,000 ఆహుతులు చేయడం ద్వారా వాటి వలన కలిగిన శక్తిని ఆస్వాదించాను. నేను విస్తృతమైన ఆచారాలను నిర్వహించడం ఇదే మొదటిసారి అయినప్పటికీ ఇట్టి ఆచారాలను ప్రయత్నించడంలో నాకు భయం లేదా సందేహం తొలగిపోయాయి. హోమము వలన అగ్ని పట్ల బంధాన్ని పెంచుకున్నాను. నాలో పరివర్తన స్పష్టంగా కనిపించింది. ఈ సమయానికి మరింత శాంతి మరియు ప్రశాంతత ఏర్పడింది. నేను ఉన్నత మాడ్యూల్స్‌కి వెళ్లి, రాజ శ్యామల మరియు వారాహి దేవి తర్పణ మరియు యంత్ర పూజ వంటి కర్మలను నిర్వహించినప్పుడు, నేను ప్రతి విషయాన్ని మరింత అంతర్గతంగా ఆలోచించడం మరియు విశ్లేషించడం ప్రారంభించాను.

"అంతర్ముఖ సమారాధ్య బహిర్ముఖ సుదుర్లభా". దేవి అనుగ్రహం మరియు గురూజీ ఆశీర్వాదంతో నేను అంతర్గత పరివర్తన దిశగా పురోగమించాను. నేను మెల్లగా విజయాలు, అపజయాలను జీవితంలోని సంఘటనలుగా చూడటం మొదలుపెట్టాను. నా దృక్పథం సాక్షిగా మారింది. ఏ పరిస్థితి వచ్చినా నా అంతరంగం స్థిరంగా ఉండటము మొదలైంది. ఎలాంటి పరిస్థితినైనా సులువుగా ఎదుర్కోగల అంతర్గత బలం నాకు లభించింది. ఇలా కొనసాగుతున్న సమయములో నేను శస్త్రచికిత్స చేయించుకొనవలసిన పరిస్థితి కలిగింది. నా కుటుంబ సభ్యులు కొంత ఆందోళనకి గురి అయ్యారు. కానీ నేను ఆ మొత్తం ప్రక్రియలో బాల మంత్రాన్ని జపిస్తూ మానసికముగా చాలా ప్రశాంతము గా ఉన్నాను. మనసులోని అంతర్గత ప్రశాంతత ఏమీ మారినట్లు అనిపించలేదు.

నేను జూలై 2021లో యు.ఎస్. వెళ్లడానికి ముందు, గురూజీని మొదటిసారిగా కలవడం మరియు వారాహి నవరాత్రుల సందర్భంగా వారాహి హోమంలో పాల్గొనడం నా అదృష్టం. ఈ శుభ సందర్భంగా నాకు శ్రీ యంత్రం కూడా లభించినది. నా ఆనందానికి అవధులు లేవు .

దేవి అనుగ్రహంతో గురూజీకి మరియు సంస్థకు కొన్ని పరిపాలనా పనుల్లో సహాయం చేయడం ద్వారా చాలా తక్కువ సేవ అయినా చేసే అదృష్టం కలిగింది.

శ్రీ విద్యను ప్రసాదించి, ఈ దివ్య మార్గంలో నన్ను నడుపుతున్న గురూజీకి ఎల్లప్పుడూ రుణపడి ఉంటాను. గురూజీకి ఆయన చూపిన కృపకు, ఆయన నాకు నేర్పిన విద్యకు నేను ఎప్పటికీ తిరిగి చెల్లించలేను. నేను గురూజీ నీడలో ఉండి, ఆయన సమర్ధవంతమైన మార్గదర్శకత్వంలో ఆధ్యాత్మిక మార్గంలో పురోగమించేలా ఆమె ఆశీర్వాదాలను కురిపించమని ఆ తల్లి లలితా త్రిపుర సుందరిని ప్రార్థిస్తున్నాను.

శ్రీ మాత్రే నమః




# స్త్రీలు పురుష సూక్తం చదవ వచ్చునా?

గురూజీ సమాధానం:

"స్త్రీలు పురుష సూక్తం చదవకూడదు.
రుద్ర నమక చమకాలు అసలే చదవకూడదు"

అని చెప్పడం చూస్తున్నాం. గమనించవలసిన విషయం ఏంటంటే "ఇది చదవాలి" అని చెప్పే వాళ్లకన్నా "ఇవి చదవకూడదు" అని చెప్పి, ఆధ్యాత్మిక తత్వాన్ని దూరం చేసేవాళ్లే ఎక్కువ కనపడుతున్నారు.

అసలు "న స్త్రీః. న పురుషః ,న నపుంసకః, ఆది మధ్యాంత రహిత" అని అమ్మవారిని దేవీభాగవతంలో వర్ణిస్తారు.

ఈ లింగ బేధాలు, జాతి బేధాలు, వర్ణ బేధాలు, గణ బేధాలు అన్నీ మనం ఏర్పరచుకున్నవే. జీవులంతా అమ్మ సంతానమే అని మనం ఒప్పుకోవాలి. ప్రకృతియే అమ్మ స్వరూపం అన్నప్పుడు ప్రకృతిలో ఉన్న ప్రతి చరాచర వస్తు ప్రపంచంలోనూ అమ్మ చైతన్యమే కనపడుతుంది. అలాంటప్పుడు ఇది చేయవచ్చు, ఇది చేయకూడదు అనడానికి కారణాలు పెద్దగా కనపడవు.

నిజానికి శ్రీ సూక్తం , పురుష సూక్తం అంటే చాలా మంది వేరే అర్థం తీసుకుంటుంటారు. శ్రీ సూక్తం అంటే స్త్రీలకు సంబంధించినది ,పురుష సూక్తం అంటే పురుషులకు సంబంధించినది అని చెబుతూ ఉంటారు. అది సరియైనది కాదు.

పురుష సూక్తం అనే పదంలో పురుష శబ్దం, "సహస్ర శీర్షా పురుషః సహస్రాక్షః సహస్రపాత్" అన్నప్పుడు ఆ పురుషత్వానికి నిర్వచనం వేరు. ఎవరిలో పూర్ణత్వం ఉంటుందో, ఎవరిలో సత్యం ఉంటుందో, ఎవరు నిత్యమో,

ఎవరు అనంతమో అతనే పురుషుడు , ఆ మహా పురుషుడే విరాట్ స్వరూపుడు అని మనం కీర్తిస్తూ ఉంటాము. అందుచేత ఆ భగవత్ తత్వాన్ని ఏ రూపంలోనైనా మనం కీర్తించవచ్చును.

శ్రీ సూక్తం లో శ్రీ శబ్దము శుభాన్ని సూచిస్తున్నది. శ్రీ అంటే సౌభాగ్యము , మంగళకరము. ఇలా మంగళ కారిణిగా ఆ భగవంతుడిని మనం అమ్మవారి రూపంలో కీర్తిస్తున్నాము. అంతేకాని "ఇది స్త్రీలు చెప్ప కూడదు ,పురుషులు చెప్ప కూడదు" అని భేదాలు ఏమీ లేవు. ఎవరైనా సరే, ఏ సూక్తమైన సరే, ప్రేమ ,భక్తి ,శ్రద్ధ... వీటితో చదివితే ఆటంకాలు ఉండవు.

ఉపాసన వేరు, నిత్యం చేసే పూజ వేరు. ఉపాసన అంటే, భగవంతునికి దగ్గరగా ఉండటం. ఇంక వేరే లక్ష్యం ఏమీ లేదు. అలా కాకుండా, వేరే ఏదో ఒక లక్ష్యాన్ని కోరి చేసేటప్పుడు, కొన్ని నిబంధనలు ఉంటాయి. ఉచ్చారణ లేదా స్వరం సరిగ్గా ఉండాలి. నిజానికి స్వరానికి ఉన్నటువంటి విలువ పూర్తి సూక్తంతో పోల్చి చూసుకుంటే కొంచెం తక్కువే. కానీ అసంబద్ధంగా పలుకకూడదు. అర్థం లేకుండా అసలు పలుక కూడదు. ఇప్పుడు,

"ఆదిత్య వర్ణే తపసోధిజాతో, వనస్పతిస్తవ వృక్షోధ బిల్వః, తస్య ఫలాని తపసానుదంతు, మాయాంతరాయాశ్చ బాహ్యా2లక్ష్మీర్నాశయామ్యహం"

అన్న చోట చదివితే బాహ్యా2లక్ష్మీర్నాశయామ్యహం అని ఆపకుండా చదవాలి. లేదా బాహ్యాః అలక్ష్మీర్నాశయామ్యహం అనైనా చదవాలి. అలా కాకుండా, బాహ్యా లక్ష్మీర్నాశయామ్యహం అని కొంతమంది చదువుతారు. అంటే అర్థం మారిపోయి, నా ఇంట్లో లక్ష్మిని తొలగించు అని అర్థం వస్తుంది. అలాగని, మనం తప్పు చదివినంత మాత్రాన ఆవిడ మన ఇంట్లో లక్ష్మిని తొలగించేస్తుంది అని అనుకోనక్కరలేదు. ఆవిడకీ తెలుసు, మనం చిన్న పిల్లలం, తెలియక చదువుతున్నామని. కానీ, వాక్య శుద్ధి ఉంటే ఎంతైనా మంచిది. ఇక్కడ స్వరము, రాగముల కన్నా అర్థానికే ఎక్కువ ప్రాముఖ్యత ఉన్నది. అలా చూస్తే అర్థవంతంగా మనము చదువుతున్నప్పుడు ఏ దోషము లేదు. ఎవరైనా, ఏదైనా చదవచ్చు.

రుద్ర నమక చమకాలలో స్వరం వలన నాభి స్థానంలో వత్తిడి కలగడం సహజం. "శంచమే మయశ్చమే ప్రియంచమే" అని చదువుతున్నప్పుడు, చమే.. చమే.. అన్న శబ్దంలో, సరిగ్గా చదివితే, పొత్తి కడుపు భాగంలో వత్తిడి కలిగే అవకాశం ఉంది. అందువల్ల "స్త్రీలు పిల్లల్ని కనే వయసులో ఉన్నప్పుడు రుద్రం చదివితే పిల్లలు కనడానికి కొంచెం ఇబ్బంది ఏర్పడవచ్చు" అని ఒక అనుమానం ఉంది. అందువలన, "ఆ వయసులో ఉన్న స్త్రీలు చమకం చదవకూడదు" అని చెప్తారు. అది కూడా, నిజమైనటువంటి ఆధ్యాత్మిక చింతన ఉన్నవారు దానికి ప్రాధాన్యం ఇవ్వరు. "ఆ పరమ శివుని నేను కీర్తిస్తున్నప్పుడు నా శరీరంలో ఏర్పడే సమస్త దోషాలను పోగొట్టగలిగే ధన్వంతరే ఆ శివుడు" అని నమ్ముతారు. "ఆ ధన్వంతరి మంత్రం చదువుతున్నప్పుడు వేరే ఇంకొక రోగం నాకు ఎందుకు వస్తుంది?" అన్న పూర్తి నమ్మకంతో ఉన్నప్పుడు ఏ సూక్తమైనా ఎవరైనా చదవచ్చు.

"ఈ జాతి వారు చదవ వచ్చు, ఆ జాతి వారు చదవ కూడదు" అనే వివక్ష కూడా లేదు. భక్తి ముఖ్యము. భక్తితో ఉన్నపుడు ఆ స్వరం గాని ఉచ్చారణ గాని దోషంగా పరిగణించ బడదు. కొంత మంది స్పీచ్ డిసార్డర్ (అంటే సరిగ్గా పలకలేని వారు) ఉన్నవాళ్లు ఉంటారు. మరి వాళ్ళు ఎప్పుడూ ఏ సూక్తాలూ చదవకూడదా? నాలుక సహకరించని వారు ఉంటారు. కొందరు షుగర్ పేషెంట్లు, మందుల వల్ల, వాళ్ళ నాలుక మొద్దు బారిపోతుంది. పురోహితుల్లోనూ కూడా షుగర్ పేషెంట్లు ఉంటారు కదా. ఆ నాలుక మొద్దు బారిపోయినప్పుడు కొన్ని పదాలు సరిగ్గా పలుకలేరు. మరి అవి ఉచ్చారణ దోషం కింద పరిగణింపబడుతుందా ? మనకు ఉన్న పరిస్థితుల్లో శ్రద్ధగా భక్తిగా, యథాశక్తి సరైన ఉచ్చారణ తో చదువుతాము.

"పలికెడిది భాగవతమట, పలికించెడివాడు రామభద్రుండట" అని పోతన గారు భాగవతములో చెప్పినట్లు, "చదివేది నువ్వు కాదు. భగవంతుడు నీ చేత చదివిస్తున్నాడు " అని శరణాగతి పొందినప్పుడు, తప్పుల మీద దృష్టి ఉండదు.

కేవలం పరమాత్ముని మీదే దృష్టి ఉంటుంది. సదా శివ బ్రహ్మేంద్రుల వారు "కిమ్ పఠనీయం కిమ పఠనీయం కిమ్ భజనీయం కిమ భజనీయం సర్వం బ్రహ్మ మయం" అన్నారు. "భజించేది నువ్వు. భజింపబడేది నువ్వు. భజన నువ్వు." నేను చదివేది తప్పేమో, తప్పు చదివితే భగవంతుడు శిక్షిస్తాడేమో అన్న ఆలోచనలన్నీ కూడా,

"నేను..నేను..నేను" అనుకున్నప్పుడే వస్తాయి. నేను అన్న పదార్థాన్ని జయించడం కష్టం. కానీ ప్రయత్న లోపం ఉండకూడదు కదా! అందువల్ల స్త్రీలు ,పురుషులు అందరికి కూడా ముఖ్యంగా ఉండాల్సింది భక్తి.

కాకపోతే కొన్ని మంత్రాలు గురు ముఖతః నేర్చుకుంటే ఎక్కువ శక్తి లభించే అవకాశం ఉన్నది. అమ్మని పిలుస్తున్నామంటే "అమ్మా!" అని సవ్యంగా పిలవాలనే శ్రద్ధ ఉండాలి. "సవ్యాపసవ్య మార్గస్థా" అని, ఆవిడ అపసవ్యంగా పలికినా పలుకుతుంది. కానీ "నా అమ్మని నేను సవ్యంగా పిలుచుకోవాలి" అనుకుని, దానికి కొంచెం శిక్షణ పొందడం, గురువు దగ్గరికి వెళ్లి ఆ మంత్రం నేర్చుకోవడం చేస్తే మంచిది. "నువ్వు సవ్యంగా పలుకక పోతే నీకు దోషం కలుగుతుంది నీకు చాలా కష్టాలు వస్తాయి" అని చాలా మంది చెప్పే మాటలు నమ్మవలసిన అవసరం లేదు. సరిగ్గా పలికితే వంద మార్కులు వస్తాయి. సరిగ్గా పలుకకపోతే డెబ్బై మార్కులు వస్తాయి. అంతే కానీ మిమ్మల్ని పరీక్షలో తప్పించడం అనేది ఉండదు. అసలు భక్తి ఉన్నపుడు నువ్వు పలికినా పలుకక పోయినా నీ ముందు నిల్చునేదే అమ్మ. "సద్యః ప్రసాదిని, భవానీ భావనా గమ్యా" అన్న పద ప్రయోగాలన్నీ తరిచి చూస్తే, ప్రతి ఒక్కళ్ళూ భక్తి శ్రద్ధలనే ప్రామాణికంగా పెట్టుకుని ప్రతి సూక్తాన్ని ప్రతి స్తోత్రాన్ని చదివితే, వెంటనే అనుగ్రహించి, కోరిన కోర్కెలు తీర్చే కారుణ్యమూర్తే తల్లి. ఆవిడకు భయపడవలసిన పని లేదు.

సంపుటి -1 సంచిక -1



గురుబ్రహ్మ గురుర్విష్ణుః
గురుర్దేవో మహేశ్వరః
గురు సాక్షాత్ పరబ్రహ్మ,
తస్మై శ్రీ గురవేనమః

గురువే బ్రహ్మ. గురువే విష్ణువు. గురువే మహేశ్వరుడు. గురువే అన్నింటినీ సృష్టించిన పరబ్రహ్మ. అటువంటి గురువుకు నేను నమస్కరిస్తున్నాను.

శ్రీ మాత్రే నమః

గురువాణి మే సంచిక నుండి మేము ప్రత్యేక పిల్లల విభాగాన్ని పరిచయం చేస్తున్నాము. గురూజీ యొక్క అమూల్యమైన మార్గదర్శకత్వంలో భారతీయ సంస్కృతి, వారసత్వం మరియు ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అందించడానికి తల్లిదండ్రులకు మార్గనిర్దేశం చేసేందుకు మేము కథనాలను ప్రచురిస్తాము.

సూచనః

ఈ సంచిక నుండి ఎవరైనా పిల్లలు ఏ విషయం పైన అయినా వారి సందేహాలు మాకు వాట్సాప్ ద్వారా తెలియజేస్తే వచ్చే సంచికలో వాటికి సమాధానాలు తెలియజేస్తాము.



New Series

# ఏకాగ్రత (Concentration)

ఒక గురుకులంలో విద్యార్థులు అందరూ చక్కగా విద్యను అభ్యసిస్తున్నారు. కానీ వారిలో ఒక విద్యార్థి సరిగా నేర్చుకోలేకపోతున్నాడు. ఎంత చదివినా అర్థం కావడం లేదు. గుర్తుకు ఉండటం లేదు. మధ్యంతర పరీక్షలలో కూడా అతడు సరిగా సమాధానాలు చెప్పలేకపోయాడు.

ఆ మరునాడు అతడు గురువు గారి దగ్గరకు వెళ్లి, "గురువు గారూ! నేను ఎంత ప్రయత్నించినా, చదివినవేవీ నాకు గుర్తుకు ఉండటం లేదు. నాకు ఏదైనా మార్గం మీరే చూపించండి" అని అడిగాడు.

"నాయనా! లోపలికి వెళ్లి పాలగిన్నె తీసుకుని రా!" అన్నారు గురువు గారు.

శిష్యుడు లోపలికి వెళ్లి పాలు ఉన్న గిన్నె తీసుకు వచ్చాడు.

గురువు గారు మరొక శిష్యుడిని పిలిచి "మరి కొంచెం పాలు తీసుకుని రా!" అని చెప్పారు.

ఆ శిష్యుడు లోపలినుండి మరి కొన్ని పాలు తీసుకువచ్చాడు.

గురువు గారు ఆ పాలను కూడా గిన్నెలో పోయించారు.

గిన్నెలో ఏ మాత్రం ఖాళీ లేకుండా పాలతో నిండి ఉన్నది.

అప్పుడు గురువు గారు మొదటి శిష్యుడిని పిలిచి, "ఈ పాలగిన్నె నీ చేతిలో ఉంచుకుని, ఇక్కడ నుండి దగ్గరలోనే ఉన్న గ్రామానికి వెళ్లిరా!" అని చెప్పారు.

"అయితే గిన్నెలో పాలు క్రిందకు ఒలికిపోకూడదు సుమా!" అని హెచ్చరించారు.

శిష్యుడు ఆ పాలగిన్నె తీసుకుని జాగ్రత్తగా రెండు చేతులతో పట్టుకుని, పక్కనే ఉన్న గ్రామంలోకి వెళ్లి గురువు గారు చెప్పినట్లు గ్రామమంతా తిరిగి, ఒక్క చుక్క పాలు కూడా క్రింద పడకుండా, జాగ్రత్తగా వెనుకకు తిరిగి వచ్చాడు.

పాలగిన్నె పక్కన పెట్టిన తరువాత గురువు గారు ఆ శిష్యుడిని తన దగ్గరకు పిలిచారు. ఆ గురు శిష్యుల మధ్య సంభాషణ ఇలా సాగింది.

గురువు గారుః "నాయనా! గ్రామానికి వెళ్లి వచ్చావు కదా!గ్రామాధికారి గారిని చూశావా!"

శిష్యుడుః "చూడలేదు గురువు గారూ!"

గురువు గారుః "భిక్ష తీసుకోమని ఎవరైనా నీ వద్దకు వచ్చారా?"

శిష్యుడుః "తెలియదు గురువు గారూ!"

గురువు గారుః "గ్రామంలో కొత్తగా కొన్ని భవనాల నిర్మాణం జరుగుతున్నది. వాటిని చూశావా?"

శిష్యుడుః "చూడలేదు గురువు గారూ!"

గురువు గారుః "దేవాలయంలో పురాణ కాలక్షేపానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. వాటిని గమనించావా?"

శిష్యుడుః "లేదు గురువు గారూ!"

గురువు గారుః "ఏమి అడిగినా 'లేదు', 'తెలియదు', 'చూడలేదు' అని సమాధానం చెబుతున్నావు. ఇవేమీ చేయకుండా నువ్వు ఏమి చేస్తున్నావు?"

శిష్యుడుః "గురువు గారూ! నా ధ్యాస అంతా పాలగిన్నె మీదనే ఉన్నది."

గురువు గారుః "ఎందుకని?"

శిష్యుడుః "పాలగిన్నె నిండా పాలు ఉన్నాయి. నా ధ్యాస తప్పితే పాలు ఒలికిపోతాయి. అందుకని నేను కేవలం పాలగిన్నెలోని పాలమీద మాత్రమే నా ధ్యాస ఉంచి, నడుచుకుంటూ వచ్చాను. ఊరిలోని మిగిలిన విషయాలు ఏవీ నాకు తెలియవు గురువు గారూ!"

ఆ మాటలు విని, గురువు గారు నవ్వుతూ, "ఇప్పుడు నీవు నీ ధ్యాసంతా పాలగిన్నె మీదనే ఉంచినట్లు, చదువుకునేటప్పుడు కూడా విద్య మీదనే నీ ధ్యాస ఉంచి చదివితే, చదువుకున్నవి అర్థం అవుతాయి, గుర్తుకు ఉంటాయి" అని చెప్పారు.

అందువల్ల విద్యార్థులారా! మీరు చదువుకునేటప్పుడు, నేర్చుకునే విషయం నుండి పక్కదారులు పట్టించే విషయాలు అనేకం ఉంటాయి. వాటివైపు దృష్టి మరల్చుకోకుండా, మీరు నేర్చుకునే విషయం మీద మాత్రమే మనసు నిలిపి, శ్రద్ధగా నేర్చుకోవడం ద్వారా మీరు గొప్ప విద్యావంతులు అయ్యే అవకాశం ఉన్నది.

## సూక్తి

ఏ పని చేసినా ఆ పని మీద ధ్యాస ఉంటే, ఆ పనిలో గొప్ప ప్రవీణులవుతారు.
భగవద్గీతలో కూడా "యోగః కర్మేషు కౌశలమ్" అని కృష్ణుడు ఇదే చెప్పాడు.

## మంచి అలవాట్లు

**సూర్యోదయానికి ముందరగానే నిద్ర లేవాలి.**
**ఉదయం నిద్ర లేవగానే, తలిదండ్రులకు నమస్కారం చేయాలి.**
**తరువాత భగవంతునికి కృతజ్ఞతా పూర్వక నమస్కారం చేయాలి.**



# గురువాణి

బాలల విభాగము


సంపుటి -1 సంచిక -1



## ప్రతి ఒక్కరూ బొట్టు ఎందుకు పెట్టుకోవాలి?

మనం ఎవరినైనా కలిసినప్పుడు వారి దృష్టి మన ముఖం మీద ఉంటుంది. ప్రత్యేకించి మన కనుబొమ్మల మధ్య ఉంటుంది. దాని ద్వారా వారిలో ఏదైనా వ్యతిరేక శక్తి (NEGATIVE ENERGY) ఉంటే, మనలోనికి ప్రసరించడానికి అవకాశం ఉంటుంది. ఎవరు మంచివారో ఎవరు చెడ్డవారో మనకు తెలియదు కదా. అందువల్ల, ఆ వ్యతిరేక శక్తి నుండి రక్షించుకోవడానికి, ఎరుపు రంగుతో కూడి, పసుపుతో తయారు చేసిన కుంకుమతో బొట్టు పెట్టుకోవాలి. ఈ రెండింటికీ, వ్యతిరేక శక్తులను పారద్రోలే గుణం ఉన్నది. కనుక, ఆడవారు, మగవారు, పెద్దలు, పిల్లలు అందరూ కూడా బొట్టు పెట్టుకోవడం ద్వారా వ్యతిరేక శక్తుల నుండి మనలను మనం రక్షించుకోవచ్చును.

# శ్రీవిద్య తరగతుల వివరాలు




## ఏప్రిల్ మరియు మే నెల తరగతులు

### మాడ్యూల్ 1 & 2

ఇంగ్లీష్: 12th, 13th & 14th మే, 5 pm - 9 pm.
తెలుగు: 19th, 20th & 21st మే, 5 pm - 9 pm.

### మాడ్యూల్ 7

ఇంగ్లీష్: 6th మే.
తెలుగు: 7th మే.

# మే నెలలో శ్రీవిద్యా జ్ఞాన పీఠం కార్యక్రమాలు



## మే 4 - శ్రీ నృసింహ జయంతి

నరసింహ జయంతి అత్యంత శక్తివంత మైన రోజు. ఈ పవిత్రమైన రోజున శ్రీమహావిష్ణువు నరసింహునిగా అవతరించాడు. ఈ రోజు సాధన వల్ల మీ ఆరోగ్యం, వృత్తి, ఆర్థిక లేదా కుటుంబాన్ని ప్రభావితం చేసే ప్రతికూలతలను తొలగించుకోవచ్చు.



## మే 12 - కాళీ అష్టమి

పూర్ణిమ తర్వాత వచ్చే 'అష్టమి తిథి' (8వ రోజు) కాళీ మాతని ప్రసన్నం చేసుకోవడానికి అత్యంత అనుకూలమైన రోజుగా పరిగణించబడుతుంది. ఈ రోజున కాళీ అమ్మవారిని ఆరాధించడం ద్వారా ఒకరి జీవితం నుండి అన్ని బాధలు, కష్టాలు మరియు ప్రతికూల ఆలోచనలు తొలగిపోతాయని కూడా ఒక ప్రసిద్ధ నమ్మకం.



## మే 14 - హనుమజ్జయంతి

'వాయు'పుత్రుడైన ఆంజనేయుడు 'భూమి'సుత అయిన సీతమ్మ అన్వేషణ కొరకు 'ఆకాశ'మార్గంబున బయలుదేరి,'జల'ధిని దాటి, సీతమ్మ దర్శనమనంతరం లంకను 'అగ్ని'కి ఆహుతి చేసిన మహామహిమోపేతుడు శ్రీ విద్యోపాసకుడు శ్రీ ఆంజనేయుడు.
ఈ పంచభూతములను సమన్వయ పరచడమే యోగసాధన పరమార్థం. హనుమంతుని పూజించడం వలన మహా రోగాలు మటుమాయం అవుతాయి. శని ప్రభావం వల్ల కలిగే బాధలూ తొలగిపోతాయి. మంచి బుద్ధి కలుగుతుంది. కీర్తి లభిస్తుంది. ధైర్యం వస్తుంది.

# గురూజీ యునైటెడ్ కింగ్‌డమ్ పర్యటన

శ్రీ గురు కరుణామయ ఏప్రిల్ 5 నుండి మే 9 వరకు యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఉంటారు. గురూజీని కలవడానికి ఆసక్తి ఉన్న సాధకులు వసుధా కోర్వాల్ +44 7740 014415 లేదా గురూజీని +91 88618 58899 కి వాట్సాప్ చేయవచ్చు.












గురూజీ UK టూర్ నుండి చిత్రాలు - నవావరణ పూజ & కుబేర పాశుపతం

# గురువాణి

కాల నిర్ణయ పట్టిక

*** మే 4 శ్రీ నృసింహ జయంతి. * మే 12 కాళీ అష్టమి. * మే 14 హనుమజ్జయంతి**





శ్రీ శోభకృత్ నామ సంవత్సరం

# 2023

కలియుగాది 5124, శాలిశకం 1945

వసంత ఋతువు **వైశాఖ మాసము**

# APRIL-MAY

## పండుగలు

ఏప్రిల్

21 వైశాఖ స్నానారంభం
22 భూదేవి శాంతి పూజ
శ్రీ గంగానదీ
పుష్కరములు ప్రారంభం
రంజాన్
సింహాచల క్షేత్ర
చందనోత్సవం
23 అక్షయ తృతీయ
మాతంగీ జయంతి
25 శంకర జయంతి
గురుమౌఢ్య త్యాగం
28 భరణికార్తె ఉ.9.11
భగళాముఖి జయంతి

మే

1 సర్వ ఏకాదశీ
అన్నవరం సత్యదేవ
కళ్యాణం
4 శ్రీనృశింహ జయంతి
5 బుద్ధ జయంతి
డొల్లు కర్తరీ (చిన్న కర్తరీ)
ప్రవేశం ఉ.6.23
9 సంకటహర చతుర్థీ
11 కృత్తికకార్తె
నిజకర్తరీ ప్రవేశం
12 కాళీ అష్టమి
14 హనుమజ్జయంతి
15 వరూధినీ ఏకాదశీ
భద్రకాళీ జయంతి
18 మాస శివరాత్రి
19 సర్వ అవ...

| | | | | | |
|---|---|---|---|---|---|
| **SUN**<br>భాను (ఆది)<br>రాహు సా.4.30 ల 6.00<br>సా.దు. 4.25 ల 5.13 | | **23** ౨<br>తదియ ఉ.8.14<br>రోహిణి రా.12.52<br>అమృ రా.9.33 ల 11.13<br>సా.వ. 4.33 ల 6.13 | **30** ౯<br>దశమి సా.6.56<br>మఘ ప.2.18<br>అమృ ప.11.38 ల 1.24<br>రా.వ.11.4 ల 12.49 | **7** ౧౬<br>విదియ రా.8.59<br>అనూరాధ రా.9.14<br>అమృ ప.11.2 ల 12.36<br>రా.వ. 2.38 ల 4.11 | **14** ౨౩<br>నవమి ఉ.5.49,దశమి తె.3.28<br>శతభిషం ప.11.27<br>అమృ రా.2.29 ల 3.59<br>సా.వ. 5.27 ల 6.58 |
| **MON**<br>ఇందు (సోమ)<br>రాహు ఉ.7.30 ల 9.00<br>వ.దు. 12.24 ల 1.12<br>వ.దు. 2.46 ల 3.34 | | **24** ౩<br>చవితి ఉ.8.42<br>మృగశిర రా.2.21<br>అమృ సా.5.1ల 6.43<br>ఉ.వ.6.49 ల 8.31 | వైశాఖ శుక్ల **1** ౧౦<br>ఏకాదశీ రా.8.39<br>పుబ్బ సా.4.38<br>అమృ ప.9.36 ల 11.21<br>రా.వ.12.25 ల 2.9 | **8** ౧౭<br>తదియ రా.7.27<br>జ్యేష్ఠ రా.8.27<br>అమృ ప.11.55 ల 1.28<br>తె.వ. 4.3 ల 5.35 | **15** ౨౪<br>ఏకాదశీ రా.1.26<br>పూర్వాభాద్ర ప.10.0<br>అమృ రా.4.15 ల 5.46<br>రా.వ. 7.7 ల 8.38 |
| **TUE**<br>భౌమ(మంగళ)<br>రాహు ప.3.00 ల 4.30<br>ఉ.దు. 8.24 ల 9.12<br>రా.దు. 10.46 ల 11.36 | | **25** ౪<br>పంచమి ప.9.42<br>ఆర్ద్ర తె.4.14<br>అమృ సా.5.27 ల 7.10<br>వ.వ.11.24ల 1.8 | **2** ౧౧<br>ద్వాదశీ రా.9.57<br>ఉత్తర రా.6.36<br>అమృ ప.10.48ల 12.32<br>రా.వ.3.31 ల 5.13 | **9** ౧౮<br>చవితి సా.5.33<br>మూల రా.7.18<br>అమృ ప.1.12 ల 2.43<br>సా.వ.5.46 ల 7.17<br>తె.వ.4.21 ల 5.51 | **16** ౨౫<br>ద్వాదశీ రా.11.38<br>ఉత్తరాభాద్ర ఉ.8.49<br>అమృ తె.5.34 ల<br>రా.వ. 8.21ల 9.53 |
| **WED**<br>సౌమ్య(బుధ)<br>రాహు ప.12.00 ల 1.30<br>వ.దు. 11.36 ల 12.24 | | **26** ౫<br>షష్ఠి ప.11.8<br>పునర్వసు పూర్తి<br>అమృ రా.3.58 ల 5.44<br>సా.వ. 5.25 ల 7.10 | **3** ౧౨<br>త్రయోదశీ రా.10.45<br>హస్త రా.8.5<br>అమృ ప.1.43 ల 3.25<br>తె.వ.4.26ల 6.6 | **10** ౧౯<br>పంచమి ప.3.25<br>పూర్వాషాఢ సా.5.55<br>అమృ ప.1.24 ల 2.54<br>రా.వ.1.23 ల 2.53 | **17** ౨౬<br>త్రయోదశీ రా.10.13<br>రేవతి ఉ.7.53<br>అమృ ఉ.7.7 వరకు<br>పునరమృ రా.12.19ల 1.53<br>రా.వ.3.27ల 5.00 |
| **THU**<br>బృహస్పతి(గురు)<br>రాహు ప.1.30 ల 3.00<br>వ.దు. 10.00 ల 10.48<br>వు.దు. 2.48 ల 3.36 | | **27** ౬<br>సప్తమి ప.12.56<br>పునర్వసు ఉ.6.36<br>అమృ రా.2.3 ల 3.49<br>వ.వ. 3.26 ల 5.12 | **4** ౧౩<br>చతుర్దశీ రా.11.6 చిత్ర రా.9.9<br>అమృ ప.2.27 ల 4.7<br>ఉ.వ. 6.6 వరకు<br>రా.వ. 2.51 ల 4.29 | **11** ౨౦<br>షష్ఠి ప.1.7<br>ఉత్తరాషాఢ సా.4.22<br>అమృ ప.10.22ల 11.52<br>పునరమృ తె.5.1 ల<br>రా.వ.8.5ల 9.34 | **18** ౨౭<br>చతుర్దశీ రా 9.11<br>అశ్విని ఉ.7.22<br>అమృ రా.2.28 ల 4.4<br>సా.వ.4.55 ల 6.30 |
| **FRI**<br>భృగు (శుక్ర)<br>రాహు ప.10.30 ల 12.00<br>ఉ.దు.8.24 ల 9.12<br>వు.దు. 12.24 ల 1.12 | **21** ౩౦<br>వైశాఖశుక్ల పాడ్యమి ఉ.8.45<br>భరణి రా.11.25<br>అమృ రా.6.36 ల 8.12<br>వ.వ. 9.1ల 10.37 | **28** ౭<br>అష్టమి ప.2.56<br>పుష్యమి ప.9.8<br>అమృతం లేదు<br>రా.వ.11.20 ల 1.6 | ○ **5** ౧౪<br>m పూర్ణిమ రా.10.49<br>స్వాతి రా.9.36<br>అమృ ప.12.38ల 2.16<br>రా.వ.3.13 ల 4.19 | **12** ౨౧<br>సప్తమి ప.10.41<br>శ్రవణం ప.2.43<br>అమృ ఉ.6.31 వరకు<br>పునరమృ రా.3.20 ల4.49<br>రా.వ.6.25 ల 7.54 | ● **19** ౨౮<br>అమావాస్య రా.8.40<br>భరణి ఉ.7.14<br>అమృ తె.5.10ల<br>రా.వ.7.25 ల 9.3 |
| **SAT**<br>స్థిర (శని)<br>రాహు ఉ.9.00 ల 10.30<br>ఉ.దు. 6.00 ల 7.36 | **22** వై౧<br>విదియ ఉ.8.14<br>కృత్తిక రా.11.56<br>అమృ రా.9.29ల 11.7<br>వ.వ.11.40ల 1.18 | **29** ౮<br>నవమి సా.4.59<br>ఆశ్రేష ప.11.45<br>అమృ ఉ.9.59 ల 11.45<br>రా.వ.1.01 ల 2.47 | **6** ౧౫<br>బ.పాడ్యమి రా.10.10<br>విశాఖ రా.9.41<br>అమృ ప.12.51 ల 2.27<br>రా.వ.1.36 ల 3.10 | **13** ౨౨<br>అష్టమి ఉ.8.9<br>ధనిష్ఠ ప.12.58<br>అమృ తె.4.42 ల 6.12<br>రా.వ.7.42 ల 9.12 |  |




శ్రీ శోభకృత్ నామ సంవత్సరం


# 2023

కలియుగాది 5124, శాలిశకం 1945

గ్రీష్మ ఋతువు **జ్యేష్ఠ మాసము**

# MAY-JUNE

| | | | | | |
|---|---|---|---|---|---|
| **SUN** భాను (ఆది)<br>రాహు సా.4.30 ల 6.00<br>సా.దు. 4.25 ల 5.13 | ● **18** ౨౮<br>1 అమావాస్య ఉ.8.55<br>మృగశిర సా.5.25<br>అమృ ఉ.8.9 ల 9.50<br>రా.వ.2.25 ల 4.8 | **21** ౩౦<br>విదియ రా.9.5<br>రోహిణి ఉ.8.29<br>అమృ రా.12.33 ల 2.15<br>ప.వ.2.24 ల 4.5 | **28** ౬<br>అష్టమి ఉ.7.5<br>పుబ్బ రా.12.00<br>అమృ సా.4.57 ల 6.42<br>ఉ.వ. 6.23 ల 8.09 | ○ **4** ౧౩<br>m పూర్ణిమ ప.9.7<br>జ్యేష్ఠ రా.4.38<br>అమృ రా.8.5 ల 9.38<br>ప.వ.10.46ల 12.19 | **11** ౨౦<br>అష్టమి ప.3.37<br>పూర్వాభాద్ర సా.6.11<br>అమృ ప.10.40 ల 12.10<br>రా.వ.3.16 ల 4.47 |
| **MON** ఇందు (సోమ)<br>రాహు ఉ.7.30 ల 9.00<br>ప.దు. 12.24 ల 1.12<br>ప.దు. 2.46 ల 3.34 | **పండుగలు**<br>మే<br>25 రోహిణికార్తె రా.1.36<br>31 నిర్జల ఏకాదశీ<br>జూన్<br>1 రామలక్ష్మణ ద్వాదశీ<br>4 శ్రీవైష్ణవ నృశింహజయన్తి విద్యారణ్య భారతీస్వామి వారి జయంతి సావిత్రి వ్రతం<br>7 సంకటహర చతుర్థీ<br>8 మృగశిరకార్తె రా.1.8<br>14 యోగినీ ఏకాదశీ<br>15 శ్రీకూర్మ జయంతి మిథున సంక్రమణం రా.1.21<br>16 మాస శివరాత్రి | **22** ౩౧<br>తదియ రా.10.1<br>మృగశిర ప.9.53<br>అమృ రా.12.56 ల 2.39<br>రా.వ.6.54ల 8.38 | **29** ౭<br>నవమి ఉ.8.46<br>ఉత్తర రా.2.4<br>అమృ రా.6.14 ల 7.58<br>ఉ.వ. 7.49 ల 9.33 | **5** ౧౪<br>బ.పాడ్యమి ఉ.7.35<br>మూల రా.3.31<br>అమృ రా.9.24ల 10.55<br>ప.వ.12.15 ల 1.46<br>రా.వ.1.58 ల 3.31 | **12** ౨౧<br>నవమి ప.1.32<br>ఉత్తరాభాద్ర సా.4.55<br>అమృ ప.12.21ల 1.52<br>తె.వ. 4.26 ల 5.58 |
| **TUE** భౌమ(మంగళ)<br>రాహు ప.3.00 ల 4.30<br>ఉ.దు. 8.24 ల 9.12<br>రా.దు. 10.46 ల 11.36 | | **23** జ్యే౧<br>చవితి రా.11.25<br>ఆర్ద్ర ప.11.42<br>అమృతం లేదు<br>రా.వ.12.48ల 2.33 | **30** ౮<br>దశమి ప.10.2<br>హస్త రా.3.44<br>అమృ రా.9.19 ల 11.2<br>ప.వ. 11.3 ల 12.46 | **6** ౧౫<br>విదియ ఉ.5.42 తదియ రా.3.39 పూర్వాషాఢ రా.2.10<br>అమృ రా.9.38 ల 11.9<br>ప.వ. 12.34 ల 2.5 | **13** ౨౨<br>దశమి ప.11.44<br>రేవతి సా.3.58<br>అమృ ప.1.38ల 3.10<br>ఉ.వ. 5.58 వరకు |
| **WED** సౌమ్య(బుధ)<br>రాహు ప.12.00 ల 1.30<br>ప.దు. 11.36 ల 12.24 | | **24** ౨<br>పంచమి రా.1.9<br>పునర్వసు ప.1.54<br>అమృ ప.11.17 ల 1.2<br>రా.వ. 10.43ల 12.29 | **31** ౯<br>ఏకాదశీ ప.10.50<br>చిత్ర తె.4.50<br>అమృ రా.10.8 ల 11.48<br>ప.వ.12.6 ల 1.46 | **7** ౧౬<br>చవితి రా.1.17<br>ఉత్తరాషాఢ రా.12.37<br>అమృ రా.6.37 ల 8.7<br>ఉ.వ.9.38 ల 11.8<br>తె.వ. 4.20 ల | **14** ౨౩<br>ఏకాదశీ ప.10.17<br>అశ్విని సా. 3.21<br>అమృ ఉ.8.19 ల 9.52<br>ప.వ. 11.26ల 12.59<br>రా.వ.12.52ల 2.27 |
| **THU** బృహస్పతి(గురు)<br>రాహు ప.1.30 ల 3.00<br>ప.దు. 10.00 ల 10.48<br>పు.దు. 2.48 ల 3.36 | | **25** ౩<br>షష్ఠి రా.3.8<br>పుష్యమి సా.4.22<br>అమృ ప.9.19 ల 11.5<br>వర్జ్యము లేదు | జ్యేష్ఠ శుక్ల **1** ౧౦<br>ద్వాదశీ ప.11.9<br>స్వాతి తె.5.22<br>అమృ రా.8.22 ల 10.0<br>ప.వ. 10.33 ల 12.11 | **8** ౧౭<br>పంచమి రా.10.49<br>శ్రవణం రా.10.59<br>అమృ ప.1.17 ల 2.46<br>ఉ.వ.5.49 వరకు<br>రా.వ. 2.42 ల 4.11 | **15** ౨౪<br>ద్వాదశీ ప.9.13<br>భరణి ప.3.9<br>అమృ ప.10.24 ల 11.59<br>రా.వ.3.16 ల 4.53 |
| **FRI** భృగు (శుక్ర)<br>రాహు ప.10.30 ల 12.00<br>ఉ.దు.8.24 ల 9.12<br>పు.దు. 12.24 ల 1.12 | | **26** ౪<br>సప్తమి తె.5.12<br>ఆశ్రేష సా.7.0<br>అమృ సా.5.13 ల 7.00<br>ఉ.వ. 6.34 ల 8.20 | **2** ౧౧<br>త్రయోదశీ ప.10.57<br>విశాఖ పూర్తి<br>అమృ రా.8.39 ల 10.16<br>ప.వ.11.0 ల 12.36 | **9** ౧౮<br>షష్ఠి రా.8.20<br>ధనిష్ఠ రా.9.17<br>అమృ ప.11.37 ల 1.6<br>రా.వ. 3.59 ల 5.29 | **16** ౨౫<br>త్రయోదశీ ఉ.8.37<br>కృత్తిక ప.3.24<br>అమృ ప.12.57 ల 2.34<br>వర్జ్యము లేదు |
| **SAT** స్థిర (శని)<br>రాహు ఉ.9.00 ల 10.30<br>ఉ.దు. 6.00 ల 7.36 | **20** ౨౯<br>జ్యేష్ఠశుక్ల పాడ్యమి రా.8.36<br>కృత్తిక ఉ.7.38<br>అమృ ఉ.6.48 వరకు<br>పునరమృ తె.5.10 ల<br>రా.వ. 12.12 ల 1.51 | **27** ౫<br>అష్టమి పూర్తి<br>మఘ రా.9.36<br>అమృ రా.6.56 ల 8.42<br>ఉ.వ. 8.17 ల 10.4 | **3** ౧౨<br>చతుర్దశీ ప.10.15 విశాఖ ఉ.5.31<br>అనూరాధ తె.5.20<br>అమృ రా.7.0 ల 8.35<br>ప.వ. 9.29 ల 11.4 | **10** ౧౯<br>సప్తమి సా.5.54<br>శతభిషం రా.7.40<br>అమృ ప.12.56 ల 2.25<br>రా.వ. 1.40 ల 3.10 | **17** ౨౬<br>చతుర్దశీ ఉ.8.31<br>రోహిణి సా.4.11<br>అమృ ప.12.51 ల 2.30<br>ఉ.వ.7.54ల 9.33<br>రా.వ.10.4 ల 11.45 |



## సూక్తి

**పూజ చేయుట వలన సత్కర్మలు పొందవచ్చును......**
**కానీ, సేవ చేయుట వలన పూర్వ కర్మలు నశించును**

~ శ్రీ గురు కరుణామయ

guruvaani

Srividya Learning Centre
#69, 6th Cross Street,
Girinagar Phase I, Bengaluru,
KA 560085, India.

srimeru999@gmail.com
+91 8088256632
www.srimeru.org

Guruvaani is a Digital Telugu monthly newsletter published by Srividya Learning Centre.